ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

జాతీయ వార్తలు

తేదీ: 06.11.2024 సమయం: 19.05 గంటలు

ముఖ్యాంశాలు

1. ప్రతిబావంతులైన విద్యార్థులకు ఆర్థిక మద్దతు అందించేందుకు పీఎం విద్యా లక్ష్మి పథకాన్ని కేంద్ర కేబినెట్ ఆమోదించింది.
2. లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ముంబైలో మహారాష్ట్ర శాసన సభ ఎన్నికలకు సంబంధించిన కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను విడుదల చేస్తారు.
3. 2024 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమోక్రాటిక్ అభ్యర్థి కమలా హారిస్‌ను ఓడించి రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ఘన విజయం సాధించారు.
4. 55వ భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవం గోవాలో ఈ నెల 20వ తేదీన ప్రారంభమవుతుంది.

------------------------------

CABINET-DECISION-VIDYALAXMI

ప్రతిబావంతులైన విద్యార్థులకు ఆర్థిక మద్దతు అందించేందుకు పీఎం విద్యా లక్ష్మి పథకాన్ని కేంద్ర కేబినెట్ ఆమోదించింది. న్యూఢిల్లీలో ఈ రోజు జరిగిన కేబినెట్ సమావేశం అనంతరం కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ విలేకరులకు ఈ విషయాలు వివరిస్తూ... ఈ పథకం కింద ఉన్నత విద్య అభ్యసించే విద్యార్థులు ఎటువంటి హామీలు లేకుండా రుణాలు పొందగలుగుతారని అన్నారు. ఈ పథకం కింద బ్యాంకులకు మద్దతు ఇవ్వడానికి ప్రభుత్వం తరపున 7 లక్షల 5 వేల రూపాయల వరకు రుణం మొత్తంలో 75 శాతం గ్యారెంటీ కల్పిస్తారు. కుటుంబ వార్షిక ఆదాయం 8 లక్షల రూపాయల వరకు ఉన్న విద్యార్థులకు మారటోరియం కాలంలో 10 లక్షల రూపాయల వరకు రుణానికి మూడు శాతం వడ్డీ రాయితీ కూడా అందిస్తారు. ఈ పథకం ద్వారా ఏడు లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుతుందని

అంచనా. ఈ పథకం ప్రయోజనాన్ని పొందేందుకు, విద్యార్థులు విద్యారుణం కోసం PM – విద్యాలక్ష్మి పోర్టల్ లో దరఖాస్తు చేసుకోవచ్చు.

----------------------------

CABINET-DECISION-FCI

ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు 10 వేల 700 కోట్ల రూపాయల తాజా ఈక్విటీని అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈరోజు న్యూఢిల్లీలో సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ.. ఆహార సేకరణలో ఎఫ్‌సీఐ కీలక పాత్ర పోషిస్తోందని, ఎఫ్‌సీఐని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించామని తెలిపారు. ఎఫ్‌సిఐ కార్యాచరణ సామర్థ్యాలను పెంపొందించే దిశగా ఇది ఒక ముఖ్యమైన ముందడుగు అని మంత్రి అన్నారు.

--------------------------

NAGPUR - RAHUL GANDHI

రాజ్యాంగం కేవలం పుస్తకం కాదని, జీవన విధానం, దార్శనికత అని లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ అన్నారు. ఈరోజు నాగ్‌పూర్‌లో జరిగిన సంవిధాన్ సమ్మాన్ సదస్సులో ప్రసంగిస్తూ.. రాహుల్ గాంధీ అణగారిన వర్గాలతో పాటు సమాజంలోని అన్ని వర్గాల ఆకాంక్షలను దృష్టిలో ఉంచుకుని డాక్టర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రూపొందించారని అన్నారు. అంతకుముందు, నాగ్‌పూర్‌లోని దీక్షాభూమిని సందర్శించి, - బాబాసాహెబ్ అంబేద్కర్ కేంద్ర స్మారక చిహ్నం - దీక్షాభూమి స్థూపం వద్ద రాహుల్ గాంధీ నివాళులర్పించారు. కాగా ఈ సాయంత్రం ముంబైలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్ లో శాసన సభ ఎన్నికలకు సంబంధించిన కాంగ్రెస్ మేనిఫెస్టోను విడుదల చేస్తారు. ఆ తర్వాత ముంబైలో మహావికాస్ అఘాడీ నేతలతో ర్యాలీలో కూడా పాల్గొంటారు.

---------------------------

LEAD SURVEY

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఈ రోజు ఇంటింటి కుటుంబ సమగ్ర సర్వే ప్రారంభమైంది. ప్రజల సామాజిక,ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమాచారాన్ని సేకరించే లక్ష్యంతో ఈ

గణనను చేపట్టారు. ఈ సందర్భంగా దాదాపు 85 వేల మంది ఎన్యూమరేటర్లు 19 వేలకు పైగా సూపర్ వైజర్లు సర్వేలో పాల్గొని సమాచారం సేకరిస్తున్రు. ఇళ్లకు స్టిక్కర్ వేసి గుర్తిస్తున్నారు. మొదటి మూడు రోజుల పాటు ప్రతి ఇంటికి స్టక్కర్ వేస్తారు. 9వ తేదీ నుంచి ఇంటింటి సమాచారం సేకరిస్తారు.

-----------------------

Deputy CM- press meet

రాజ్యాంగంలో పొందుపరిచిన సామాజిక న్యాయం, సమాన అవకాశాల కల్పన కోసం తమ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే దేశ భవిష్యత్తు కు దిశ నిర్దేశం చేస్తుందని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఈ రోజు హైదరాబాద్ ప్రజా భవన్ లో భట్టి విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, ఆర్థిక, సామాజిక, రాజకీయ, కుల, మత, విద్యా, వ్యాపార, వ్యవసాయం వంటి అంశాలపై సమాచార సేకరణ చేయడమే తమ ప్రభుత్వం ఉద్దేశ్యం అని చెప్పారు. ఈ సమగ్ర కుటుంబ సర్వే వలన ప్రజా సంక్షేమ పథకాల నుంచి లబ్ధిదారుల కోత విధించడం ఉండదని పేర్కొన్నారు.

-------------------------

US PREZ-RESULT

2024 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమోక్రాటిక్ అభ్యర్థి కమలా హారిస్‌ను ఓడించి రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డోనాల్డ్ ట్రంప్ ఘన విజయం సాధించారు. ట్రంప్ రెండవ సారి అమెరికా అధ్యక్షుడిగా విజయం సాధించడంతో ఫ్లోరిడాలో ట్రంప్ మద్దతుదారులు ఆనందోత్సాహాలతో వేడుకలు జరుపుకుంటున్నారు. అధ్యక్ష పోటీ రేసులో ట్రంప్ - అవసరమైన 270 ఎలక్టోరల్ ఓట్లను సాధించారు, పెన్సిల్వేనియా, జార్జియాతో సహా కీలకమైన రాష్ట్రాలను గెలుచుకున్నారు. అధ్యక్ష గెలుపుతో పాటు, ఒహియో, వెస్ట్ వర్జీనియాలో విజయాలతో సెనేట్ ను తిరిగి పొందడం ద్వారా ట్రంప్ పార్టీ ప్రయోజనం పొందింది. హారిస్ - న్యూ హాంప్‌షైర్, వర్జీనియా, నెబ్రాస్కాల్లో విజయాలు సాధించినప్పటికీ, మిచిగాన్, విస్కాన్సిన్, పెన్సిల్వేనియా వంటి కీలక రాష్ట్రాలలో ట్రంప్ ఆధిపత్యాన్ని సాదించారు.

-------------------------

PM-TRUMP

అమెరికా ఎన్నికల్లో విజయం సాధించిన డొనాల్డ్ ట్రంప్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమం ద్వారా అభినందనలు తెలిపారు. భారత్-అమెరికాల మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం అవుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. రెండు దేశాల ప్రజల అభివృద్ధి, ప్రపంచ శాంతి, స్థిరత్వం, శ్రేయస్సును ప్రోత్సహించడానికి కలిసి పనిచేయాలని ట్రంప్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు.

---------------------

IFFI- GOA

55వ భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవం గోవాలో ఈ నెల 20వ తేదీన ప్రారంభమవుతుంది. తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ ఉత్సవంలో 18వ సంచిక ఫిల్మ్ బజార్ ఈ నెల 25వ తేదీ వరకు నిర్వహిస్తారు. ఈ చిత్రోత్సవంలో 208 చిత్రాలను ప్రదర్శిస్తారని సమాచార ప్రసార శాఖ తెలియజేసింది. చిత్ర ప్రదర్శన ఈ నెల 21వ తేదీ నుంచి 28వ తేదీ వరకు జరుగుతుంది. ఈ సంవత్సరం, భారతదేశం, దక్షిణాసియా నుండి ఉత్తమ చిత్రాలను ప్రదర్శిస్తారు. ఇది గ్లోబల్ ఫిల్మ్ ప్రోగ్రామర్లు, డిస్ట్రిబ్యూటర్లు, సేల్స్ ఏజెంట్లు, పెట్టుబడిదారులతో అనుసంధానం అయ్యేందుకు దర్శకలుకు ఎంతగానో దోహదపడుతుంది.

------------------------

UTTRAKHAND- ADB MOU

ఉత్తరాఖండ్‌లో నీటి సరఫరా, పారిశుధ్యం, ఇతర పట్టణ సేవలను మెరుగుపరిచేందుకు కేంద్రం, ఆసియ అభివృద్ధి బ్యాంక్ ADB ఈరోజు 200 మిలియన్ అమెరికన్ డాలర్ల రుణంపై సంతకం చేశాయి. ఈ సందర్భంగా ఆర్థిక వ్యవహారాల శాఖ సంయుక్త కార్యదర్శి జూహీ ముఖర్జీ మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్ట్ కేంద్ర ప్రభుత్వ పట్టణాభివృద్ధి ఎజెండాతో పాటు పట్టణ సేవలను మెరుగుపరచడానికి ఉత్తరాఖండ్ రాష్ట్ర ప్రభుత్వ చొరవతో పాటు నగరాల్లో నివాసయోగ్యతను పెంచే లక్ష్యం కలిగి ఉందన్నారు. ADBకి చెందిన డైరెక్టర్ మియో ఓకా మాట్లాడుతూ - వాతావరణం, పర్యావరణ సమస్యలను తట్టుకోగల పట్టణ మౌలిక సదుపాయాలను సృష్టించి,

ప్రజల భద్రత, ఆరోగ్యాన్ని కాపడడం ఈ ప్రాజెక్ట్ ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఈ ప్రాజెక్ట్ హల్ద్వానీలో రవాణా, అర్బన్ మొబిలిటీ, డ్రైనేజీ, వరద నిర్వహణ, ప్రజా సేవలను, ఉత్తరాఖండ్‌లోని నాలుగు నగరాల్లో నీటి సరఫరాను మెరుగుపరుస్తుంది.

-------------------

DAY DELHI-POLLUTION

ఢిల్లీ-NCRలో వాయు నాణ్యతలో క్షీణత కొనసాగుతు ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ ఈ రోజు 351 కి చేరుకుంది. దీపావళి తర్వాత వరుసగా ఆరవ రోజు దేశ రాజధానిలోని పలు ప్రాంతాలు పొగమంచు కమ్ముకోవడంతో ఈ ప్రాంతంలో గాలి నాణ్యత చాలా పేలవంగా ఉంది. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో AQI 400 మార్కు స్థాయికి చేరుకుందని కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డ్ తెలిపింది. ఆనంద్ విహార్‌లో 396, అలీపూర్‌లో 371, బురారీలో 361, న్యూ మోతీ బాగ్‌లో 371, పంజాబీ బాగ్‌లో 382, నెహ్రూ నగర్‌లో 369 వాయి క్షీణత నమోదైంది.

--------------------------